క్లుప్తంగా

రేపు మాఘ పౌర్ణమి పూజలు

కడప కల్చరల్ : మాఘ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి విశ్వక్సేన పూజ, నవకలశ స్థాపన, తిరుమంజనం, విష్ణు సహస్ర నామ పారాయణం, నక్షత్ర, కుంభ హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

డాక్టరేట్ ప్రదానం


ఎం. వీరభద్రయ్య

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు ఎం. వీరభద్రయ్యకు నాగపూర్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. 'ఇంపాక్ట్ అండ్ ఇంప్లికేషన్స్ ఆఫ్ సివిల్ న్యూక్లియర్ డీల్ ఆన్ ఇండో యూఎస్ బైలేటరల్ రిలేషన్స్: ఆన్ అనలిటికల్ స్టడీ 2005–2015' అన్న అంశంపై నాగపూర్ విశ్వవిద్యాలయం ఆచార్యులు డా. ఉమా చటర్జీ ఆధ్వర్యంలో ఈయన పరిశోధన పూర్తి చేశారు. దీంతో ఈయనకు నాగ్‌పూర్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా వీరభద్రయ్యను మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా, అధ్యాపకులు అభినందించారు.

క్రీడాదుస్తులు పంపిణీ


క్రీడాదుస్తులు అందజేస్తున్న హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి లక్ష్మణ్

కడప స్పోర్ట్స్ : రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే వైఎస్సార్ కడప జిల్లా హ్యాండ్‌బాల్ జట్టుకు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వి. లక్ష్మణ్ క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. ఈనెల 23, 24 తేదీల్లో నంద్యాల పట్టణంలోని డా. రామలింగారెడ్డి మహిళా డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించనున్న 52వ రాష్ట్రస్థాయి మహిళా హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్టు గురువారం కడప నుంచి పయనమైంది. కార్యక్రమంలో కోచ్ రాధారాణి, క్రీడాకారిణులు పాల్గొన్నారు.

పుస్తకం ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : సీనియర్ ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్ కమ్ జర్నలిస్టు దివంగత రాయల్ రషీద్ జీవిత చరిత్ర పుస్తకాన్ని గురువారం కడపలో ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు నరేష్ రామాంజులరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి మాట్లాడుతూ తండ్రి జీవిత చరిత్ర పుస్తకాన్ని తీసుకువచ్చిన షబ్బీర్‌ను అభినందించారు. తండ్రిని ఆదర్శంగా తీసుకుని సమాజంలో సేవలు అందించడం అభినందనీయమన్నారు.

ఆడపిల్ల ఇంటికి దీపం


మాట్లాడుతున్న మొహమ్మద్ ఖాజా

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా కడప ఇందిరానగర్‌లో గురువారం బేటి బచావో బేటి పడావో- ఆడపిల్ల ఇంటికి దీపం అనే కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ మొహమ్మద్‌ఖాజా మాట్లాడుతూ మన దేశంలో బాలికల జనాభా తగ్గిపోతోందన్నారు. స్త్రీ పురుష లింగ బేధాన్ని తగ్గించేందుకు అన్ని రంగాల్లోనూ స్త్రీలు సాధికారత సాధించే లక్ష్యంతో మనమందరం పాటుపడాలని, ఆ దిశగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మొహమ్మద్ సికిందర్ హుస్సేన్, స్కూల్ హెడ్‌మాస్టర్ మహబూబ్‌ఖాన్, అధ్యాపకులు సనోబర్ నవీన్, అకీబ్, అబుబాకర్, మస్తానవల్లి, కిరణ్, సమీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

వల్లూరు : మండలంలోని పైడికాలువ గ్రామంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవ, కుంభాభిషేక మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు హరినారాయణ ఆధ్వర్యంలో ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ధ్వజ బలి కార్యక్రమాన్ని నిర్వహించారు.

విలువలతో బోధన చేయాలి

చింతకొమ్మదిన్నె : విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను బోధించాలని ఆర్జేడీ రాఘవ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని భారత్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన మండలస్థాయి క్విజ్ పోటీలను ఆయనతోపాటు డీఈవో అనురాధలు పరిశీలించి మాట్లాడారు.

భక్తిశ్రద్ధలతో అంకురార్పణ


విద్యుద్దీప వెలుగుల్లో శ్రీ విజయదుర్గమ్మ ఆలయం

ప్రారంభమైన విజయదుర్గాదేవి బ్రహ్మోత్సవాలు

కడప కల్చరల్ : శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో 22వ వార్షిక బ్రహ్మోత్సవాలను గురువారం వైభవంగా ప్రారంభించారు. ఉత్సవాల ప్రారంభ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభ పూజలు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా సాయంత్రం 6 గంటలకు గణపతి పూజ, పుణ్యహవాచనం నిర్వహించారు. ఊరేగింపుగా పుట్టమట్టి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాల పూర్వంగ కార్యక్రమంలో భాగంగా పంచ గవ్యారాధన, అఖండ దీపారాధన తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా రంగురంగుల విద్యుద్దీపాలతో కనుల పండువగా అలంకరించారు. ప్రధాన ద్వారం వద్ద అమ్మవారి మూర్తిని, మహిమలు తెలిపే సన్నివేశాలను, రంగురంగుల విద్యుద్దీప కటౌట్లతో ప్రదర్శించారు.


అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

నేడు – బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 4.30 గంటలకు దీక్షా స్నపనం, యాగశాల ప్రవేశం, లఘు వాస్తుపూజ, హోమం, ధ్వజారోహణం, ప్రధాన కలశ స్థాపన, రుద్రాభిషేకం, శ్రీ చక్రార్చన తదితర పూజలు నిర్వహిస్తారు. రాత్రి 8 గంటలకు అమ్మవారిని సింహ వాహనంపై కొలువు దీర్చి ఆలయ ప్రదక్షిణ చేయించనున్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని చిన్నచౌక్‌లో వున్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలురు)ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ గురువారం తమ సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలు ఉంటున్న వసతిగదులను, వంటశాలను, టాయిలెట్స్‌ను జడ్జి పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జడ్జి న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవలు పథకం –2015 ను వివరించారు. పిల్లలు మంచి నడవడికతో విద్యను అభ్యసించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. పిల్లల విద్యా, ఆరోగ్య విషయాలపట్ల తగిన జాగ్రత్తలు వహించాలని అధికారులను ఆదేశించారు. విద్య విలువైనదని, క్రమశిక్షణతో అభ్యసించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికారసంస్థ కడప దృష్టికి తీసుకుని రావచ్చన్నారు.


గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏ. మణికుమారి, వార్డెన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప టూటౌన్ సీఐగా ఇబ్రహీం


కడప టూటౌన్ సీఐగా బదిలీ అయిన సీఐ జి. ఇబ్రహీం


వీఆర్‌కు బదిలీ అయిన సీఐ ఎం. తబ్రేజ్

కడప అర్బన్ : వైఎస్‌ఆర్ జిల్లా కడప టూటౌన్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా ప్రొద్దుటూరు టూటౌన్ సీఐగా పనిచేస్తున్న జి. ఇబ్రహీంను బదిలీ చేస్తూ కర్నూలు– కడప రేంజ్ డీఐజీ విజయారావు ఉత్తర్వులు జారీ చేశారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఎస్‌ఐగా విధుల్లో చేరిన ఆయన జిల్లాలో పలు స్టేషన్‌లలో పనిచేస్తూ సీఐగా పదోన్నతి పొందారు. తరువాత ప్రస్తుతం ప్రొద్దుటూరు సీఐగా పనిచేస్తున్నారు. కడప టూటౌన్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా బదిలీ అయిన ఆయన నేడో, రేపో బాధ్యతలను స్వీకరించనున్నారు. కాగా ఇప్పటివరకు కడప టూటౌన్ సీఐగా పనిచేసిన ఎం. తబ్రేజ్ గత ఏడాది అక్టోబర్ 13న కడప టూటౌన్ సీఐగా బాధ్యతలను చేపట్టారు. ఇటీవల పరిపాలన సంబంధమైన కారణాలతో ఆయనను అనంతపురం వీఆర్‌కు బదిలీ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఓటుహక్కు ప్రజాస్వామ్యానికి వజ్రాయుధం

ఏఎఫ్‌యూ : ఓటుహక్కు ప్రజాస్వామ్యానికి వజ్రాయుధంలాంటిదని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కడప నగర పరిధిలోని అలంఖాన్‌పల్లెలో నిర్వహించిన 7రోజుల స్పెషల్‌క్యాంపు ముగింపు సమావేశం, సర్టిఫికెట్‌ల ప్రదానోత్సవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సమాజహితమే అభిమతంగా సేవలందించడం సంతోషంగా ఉందన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలోని ఇళ్లకు వెళ్లి ఓటు ఆవశ్యకతను తెలియజెప్పడంతో పాటు ఓటుహక్కు నమోదు చేసుకునేలా చైతన్యం తీసుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీఆర్ఐ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సునీల్ జయంత్, డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రమాదేవి, ఉదయప్రకాష్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, ఎన్.ఆర్. పల్లె డీసీబీసీయూ చైర్మన్ అన్నం నాగమల్లేశ్వరయ్య, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.


ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి

వర్మీ కంపోస్టుపై రైతులకు శిక్షణ

కడప అగ్రికల్చర్ : వర్మీ కంపోస్టు ఎరువు తయారీ కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకుని అదనపు ఆదాయం పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్ర సేద్య విభాగ శాస్త్రవేత్త డాక్టర్ సాయి మహేశ్వరి పేర్కొన్నారు. గురువారం ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ఆర్య పథకంలో వర్మీ కంపోస్టు ఎరువుల తయారీపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులలో యువ రైతులు కొద్దిపాటి వనరులను లాభసాటిగా మార్చుకునేందుకు ఆర్య పథకంలో భాగంగా వానపాముల ఎరువుల తయారీ ఎంతగానో దోహదపడుతుందన్నారు. దీనిని కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకుంటే రైతులు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. జిల్లాలో గత సంవత్సరంలో ఆర్య పథకంలో భాగంగా 12 యూనిట్లు యువతకు అందించడం జరిగిందన్నారు. వాటి ద్వారా లాభదాయకమైన ఉపాధి నెలకొల్పుకుంటున్నారన్నారు. వర్మికంపోస్టు తయారీకి అనుకూలమైన పరిస్థితులు, కావాల్సిన పరికరాలు, వాడదగిన వ్యర్థ పదార్థాలు, వానపాముల రకాలు, కంపోస్ట్ బెడ్లు నిర్మాణం, కంపోస్టు తయారీ విధానం, కంపోస్టు తయారీలో జాగ్రత్తలు, కంపోస్టు ఎరువులో పోషకాలు, వాడవలసిన మోతాదుల గురించి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు స్వామి చైతన్య, డాక్టర్ మహేష్‌బాబు, డాక్టర్ మానస, డాక్టర్ సురేష్, మాధవి, మమతతోపాటు రైతులు పాల్గొన్నారు.


వర్మికంపోస్టు ఎరువుల తయారీ గురించి రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్త సాయి మహేశ్వరి

ప్రారంభమైన శ్రీరంగనాథుని బ్రహ్మోత్సవాలు

పులివెందుల టౌన్ : పట్టణంలో శ్రీరంగనాథస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. రంగనాథస్వామికి ఆలయ అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఆలయ ఈఓ కె.వి.రమణ శ్రద్ధ తీసుకున్నారు. అనంతరం ఉదయం సూర్య ప్రభ, సాయంత్రం చంద్ర ప్రభ వాహనంపై శ్రీరంగనాథుడు దర్శనమిచ్చారు.


సూర్యప్రభ వాహనంపై శ్రీరంగనాథుడు

వైభవంగా వార్షికోత్సవ ఉత్సవాలు

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామ సమీపంలోని కాటారెడ్డి కాలువ వద్ద వెలసిన శ్రీ కాశిరెడ్డినాయన, లక్ష్మీనరసింహస్వామి 20వ వార్షికోత్సవ ఉత్సవాలు గురువారం రెండవ రోజు వైభవంగా నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

అనంతరం న్యూ క్యాటగిరి ఎద్దులచే బండ లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సీకెదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్‌రామాంజులరెడ్డి ప్రారంభించారు. పోటీలల్లో గెలుపొందిన ఎద్దులకు బహుమతులు అందజేశారు. అలాగే పెండ్లిమర్రిలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సీకెదిన్నె జెడ్పీటీసీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

చెన్నూరు : మండలంలోని గోపవరం గ్రామం వద్ద నిర్మించిన శ్యామల మాతాంగిదేవి ఆలయంలో మాతాంగి దేవి విగ్రహ ప్రతిష్ట గురువారం పుష్పగిరి పీఠాధిపతి జగద్గురు శ్రీ అభిన ఉద్దండ విద్యాశంకర భారతిస్వామి చేతులు మీదుగా వైభవంగా నిర్వహించారు. అనంతరం బండ లాగుడు పోటీలు ఏర్పాటు చేసి బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, నరేస్ రామాంజులురెడ్డిలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

వల్లూరు : మండలంలోని పెద్దలేబాక, బక్కిరెడ్డిపల్లె గ్రామాల సరిహద్దులో వెలసిన శ్రీ సిద్వేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం శివపార్వతుల కల్యాణంను వేద పండితులు శేఖర్‌శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పంచామృతాభిషేకం, వివిధ హోమాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, పలు గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

ఎన్నో సంవత్సరాల కల నేటికి సాకారం

- బళ్లారిరోడ్డులో రూ.75.09 లక్షలతో వరదనీటి కాలువ నిర్మాణానికి శంకుస్థాపన
- ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : బళ్లారి రోడ్డు, మేకలదొడ్డి తదితర ప్రాంతాల ప్రజల ఎన్నో సంవత్సరాల కల నేటికి సాకారం కావడం సంతోషంగా ఉందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. గురువారం స్థానిక 28వ డివిజన్‌లో నవత ట్రాన్స్‌పోర్టు సమీపంలో రూ.75.09లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన వరదనీటి కాలువ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అంజాద్‌బాష మాట్లాడుతూ ఈ ప్రాంతవాసులు వర్షపు నీరు పోయేందుకు కాలువలు లేక ఎంతో కాలంగా చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. చిన్నపాటి వర్షం పడినా రోడ్ల మీదకు, ఇండ్లలోకి నీరు వచ్చి అనేక ఇబ్బందులు పడేవారని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వం వైఎస్సార్ జిల్లాతోపాటు కడప నగరాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. ఎప్పుడు వర్షం పడినా రహదారుల్లో, ఇళ్ల మధ్య నీరు నిలుస్తూ ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర అవస్థలు పడే పరిస్థితి ఉండేదన్నారు. రానున్న రోజుల్లో ఆ ఇబ్బందులన్నీ తొలగిపోనున్నాయన్నారు. వైఎస్సార్ హయాంలో చేసిన పనులను కూడా కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు కావాలనే పూర్తి చేయకుండా ప్రజలను ఇబ్బందులు పెట్టారని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత అసంపూర్తిగా ఉన్న ఆ పనులన్నీ పూర్తి చేయడంతోపాటు కడప నగరంలో అత్యంత ముఖ్యమైన వరద నీటి కాలువలను నిర్మించడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర మైనార్టీ సలహాదారులు ముక్తి మొహమ్మద్ అలీ బొగ్దాది, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్, 28వ డివిజన్ కార్పొరేటర్ అరీఫుల్లా బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.జయచంద్రారెడ్డి, పీవీఎస్ మూర్తి, త్యాగరాజు, షంషీర్, జమీర్, గౌస్, మాస్టర్ అహ్మద్, జఫరుల్లా, అజ్మతుల్లా పాల్గొన్నారు.


వరదనీటి కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

ప్రభువు దీవెనతో జిల్లా వాసులకు సుఖ శాంతులు

కడప కల్చరల్ : ప్రభువైన ఏసుక్రీస్తు ఆశీస్సులతో జిల్లా వాసులందరికీ సుఖ శాంతులు పుష్కలంగా లభించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్ బాష ఆకాంక్షించారు. గురువారం స్థానిక సీఎస్ఐ చర్చిలో రైట్ రెవరెండ్ బిషప్ డాక్టర్ ఐజాక్ వరప్రసాద్ మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన బిషప్‌ను కలిసి శుభాకాంక్షలు అందజేసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా అంజాద్‌బాష మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం జిల్లా వాసులు ఏసు ప్రభువును ప్రార్థించాలని కోరారు. నగర డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి మాట్లాడుతూ జిల్లాతోపాటు రాష్ట్ర మంతటా సుభిక్షంగా ఉండాలని, ఎలాంటి అలజడి, అశాంతి లేకుండా ప్రజలంతా శాంతి సౌభాగ్యాలతో విలసిల్లేలా ప్రభువు ఆశీస్సులు ఉండాలని కోరారు. ఈ సందర్భంగా బిషప్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ మత పెద్దలు, పాస్టర్లు, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, కార్పొరేటర్ షేక్ మొహమ్మద్ షఫీ, నాయకులు నారపరెడ్డి సుబ్బారెడ్డి, జయ చంద్రారెడ్డి, పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, మాస్టర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.


రైట్ రెవరెండ్ బిషప్ డాక్టర్ ఐజాక్ వరప్రసాద్‌ను సత్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష

రాష్ట్ర ప్రజల శ్రేయస్సే జగనన్న ధ్యేయం

వీరపునాయునిపల్లె : రాష్ట్రంలో ప్రజల శ్రేయస్సే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ప్రజలు వారి సమస్యలను మండల కేంద్రాలకు వెళ్లి పరిష్కరించుకునేవారన్నారు. జగనన్న ప్రభుత్వంలో ప్రజలు వారి గ్రామాల్లోనే ఏర్పాటు చేసిన సచివాలయాలలో వారి సమస్యలను పరిష్కరించుకుంటున్నారన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కూడా సచివాలయ వ్యవస్థలో వలంటీర్ల ద్వారా ప్రజల ముంగిటకే చేరుతున్నాయన్నారు. వారు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ప్రతి ఏడాది సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో వారిని సత్కరిస్తోందన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివన్నారు. వారు చేసిన కృషి వలన రాష్ట్రంలో మరణాల శాతం తగ్గిందన్నారు. దీనిపై భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు ప్రత్యేక దృష్టి పెట్టాయన్నారు. రాబోవు ఎన్నికల్లో 85 శాతం ఓట్లతో విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. చంద్రబాబు ఓటమి ఖాయమని ఆయన భార్య భువనేశ్వరి గుర్తించిందన్నారు. సిద్ధం సమావేశాలకు ప్రజలు చూపుతున్న ఆదరణను చూసి చంద్రబాబుకు గుండెల్లో వణుకు పుడుతోందన్నారు. కుప్పంలో ఓటమి ఖాయమని తెలుసుకున్న చంద్రబాబు ఎక్కడ నుంచి పోటీ చేయాలో తెలియక అయోమయంలో పడ్డాడన్నారు. చంద్రబాబు ఆయన కుమారుడు లోకేష్ రాష్ట్రంలో ఎక్కడ పోటీ చేసినా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డు పొందిన వలంటీర్లను ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ఎంపీడీఓ సురేంద్రనాథ్, స్థానిక ఎంపీటీసీ రాఘవ యాదవ్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


వీరపునాయునిపల్లెలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదే

కమలాపురం : గత ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదేనని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, జేసీఎస్ కన్వీనర్ ఉత్తమారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పెద్దచెప్పలిలో వారు ఇంటింటికి తిరిగి జగనన్నకే ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటి తలుపు తట్టి వారికి ఈ ప్రభుత్వంలో అందిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. గత ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదేనన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని పథకాలు ఏపీలో అమలు అవుతున్నాయన్నారు.

రైతులను విస్మరించిన బీజేపీ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం ఢిల్లీ రైతు ఉద్యమంపై బీజేపీ ప్రభుత్వ దమనకాండ నశించాలని కోరుతూ నగరంలోని పాతబస్టాండ్ వద్ద నున్న జ్యోతిరావు పూలే సర్కిల్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఢిల్లీ రైతాంగం శాంతియుతంగా ఢిల్లీకి పోతుంటే బీజేపీ ప్రభుత్వం రైతులపై కాల్పులు జరిపి పోలీసులచే దాడి చేయించి రైతు శుభ్ కరణ్ సింగ్‌ను బలితీసుకుందన్నారు. రైతు ఉద్యమంలో రైతు నాయకులపై పెట్టిన కేసులను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ శివారెడ్డి, సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు వెంకట శివ, రామ్మోహన్, రైతు సంఘాల నాయకులు శేఖర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, సావంత్, సుధాకర్, సీఐటీయూ నగర అధ్యక్షులు చంద్రా రెడ్డి, విద్యార్థి యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పాతబస్టాండు వద్ద నిరసన తెలుపుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

సమస్యలు సమర్థవంతంగా ఎదుర్కోవాలి

ఏఆర్ డీఎస్పీ మురళీధర్

కడప అర్బన్ : అత్యవసర సమయంలో పరిస్థితిని అదుపులోకి తీసుకుని వచ్చే విధంగా ప్రతి ఒక్క పోలీసు నిష్ణాతుడు కావాలనీ ఏఆర్ డీఎస్పీ మురళీధర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు ఏఆర్, సివిల్ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులకు స్థానిక పెరేడ్ గ్రౌండ్‌లో రిప్రెషర్ కోర్స్‌లాగా పలు ముఖ్యమైన అంశాలను శిక్షణలో భాగంగా నిర్వహించారు. రాబోయే రోజుల్లో ఏవైనా సమస్యలు తలెత్తినపుడు సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సమస్యను అదుపులోనికి తీసుకు వచ్చే విధంగా ప్రతి ఒక్క పోలీసు నిరంతరం అప్రమత్తంగా వుండాలనీ ఏఆర్ డీఎస్పీ తెలిపారు. సమస్యలు తలెత్తినపుడు జన సమూహంను నివారించేందుకు సమయస్ఫూర్తిగా వ్యవహరించాల్సిన అనేక అంశాలపై పోలీసు సిబ్బందికి శిక్షణ నిర్వహించారు.

- స్టోన్‌గార్డ్, హెల్మెట్, లాఠీ, టియర్‌గ్యాస్ అయుధం మొదలైన ఇతర పరికరాలు లాఠీ డ్రిల్, మాబ్ కంట్రోల్, ఏ సమయంలో చేయాలి. సంయమనం పాటించాలి. భాష్ప వాయువు ప్రయోగాలను ఎలాంటి సందర్భాల్లో అనుసరించాలనే విషయాలపై పోలీసులకు మెలకువలను నేర్పిస్తున్నారు. పోలీసు సిబ్బంది శిక్షణను సద్వినియోగం చేసుకునేలా, జిల్లాలోని ప్రతి పోలీస్ సిబ్బంది తర్ఫీదు పొందేలా డ్రిల్‌ను రూపొందించారు. ఏఆర్ డీఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి కఠిన పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఈ మాక్ డ్రిల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు ఆనంద్, వీరేష్, శివరాముడు, టైటస్, ఆర్ఎస్ఐలు, ఏఆర్ పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.



ఆందోళనకారులను ఎదుర్కొనేలా పోలీసులకు మాక్ డ్రిల్‌లో శిక్షణ ఇస్తున్న దృశ్యం